క్లుప్తంగా

ఎంపీడీఓగా బ్రహ్మయ్య బాధ్యతల స్వీకరణ



ఎంపీడీఓగా బాధ్యతలు స్వీకరిస్తున్న బ్రహ్మయ్య

సీఎస్‌పురం(పామూరు): సీఎస్‌పురం ఎంపీడీఓగా పామూరు ఎంపీడీఓ ఎల్.బ్రహ్మయ్య గురువారం అదనపు బాధ్యతలు చేపట్టారు. ఇప్పటివరకు హెచ్‌ఎంపాడు ఎంపీడీఓ రంగసుబ్బారాయుడు ఇక్కడ ఎంపీడీఓగా అదనపు బాధ్యతలు నిర్వహించారు. ఎంపీడీఓ బ్రహ్మయ్య మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రభుత్వ పథకాలు అందేలా చూస్తానన్నారు.

నూరుశాతం ఇంటిపన్నులు వసూలు చేయాలి



మాట్లాడుతున్న ఇన్‌చార్జి ఎంపీడీఓ హనుమంతరావు

హనుమంతునిపాడు: పంచాయతీల్లో నూరు శాతం ఇంటి పన్నులు వసూలు చేయాలని ఇన్‌చార్జి ఎంపీడీఓ హనుమంతరావు అన్నారు. ఇన్‌చార్జి ఎంపీడీఓగా గురువారం ఆయన బాధ్యతలు స్వీకరించారు. అనంతరం కార్యదర్శులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఇంటిపన్ను నూరు శాతం వసూలు చేయాలన్నారు. ప్రభుత్వం ఇస్తున్న సర్వేలన్నీ జాగ్రత్తగా నిర్వహించాలని కార్యదర్శులకు సూచించారు.

సైన్స్ ప్రాజెక్టులకు ఎంపికైన విద్యార్థులు



విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

లింగసముద్రం: మండలంలోని తిమ్మారెడ్డిపాలెం ఏపీ మోడల్ స్కూల్ విద్యార్థులు జిల్లా స్థాయిలో సైన్స్ ప్రాజెక్టులకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ షేక్ మహ్మద్ హప్తార్ బుధవారం తెలిపారు. పాఠశాలలో 10వ తరగతి విద్యార్థిని పాలంకి లిఖిత, 8వ తరగతి విద్యార్థి పైడాల నవలోకేష్ జిల్లా స్థాయిలో సైన్స్ ప్రాజెక్టులకు ఎంపిక కావడంపై ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు అభినందించారు. ఎంపికైన ప్రాజెక్టులు రూపకల్పనకు చర్యలు తీసుకున్న ఉపాధ్యాయులు ఎస్.అన్నపూర్ణ, ఎం.కళ్యాణిలను అభినందించారు.

దరఖాస్తుల గడువు పొడిగింపు

కొండపి: మండలంలోని స్థానిక డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో ఐదో తరగతి, ఇంటర్మీడియెట్ మొదటి సంవత్సరంలో ప్రవేశానికి ఆన్‌లైన్ దరఖాస్తుల గడువును 13 వరకు పొడిగించినట్లు ఎంఈఓ కె.సురేఖ ఒక ప్రకటనలో తెలిపారు. గతంలో ఆరో తేదీ వరకు మాత్రమే అవకాశం ఉందని, ప్రభుత్వ ఆదేశాల మేరకు 13వ తేదీ వరకు పొడిగించామన్నారు. విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పొగాకు బోర్డు ఈడీకి ఘన సన్మానం




ఈడీ శ్రీధర్‌బాబుని సన్మానిస్తున్న పొగాకు బోర్డు సిబ్బంది

టంగుటూరు: స్థానిక పొగాకు వేలం కేంద్రంలో పొగాకు బోర్డు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ శ్రీధర్‌బాబును ఘనంగా సన్మానించారు. అనంతరం బోర్డు సిబ్బందితో సమావేశం నిర్వహించి ఈ నెల 19 నుంచి వేలం ప్రారంభానికి కావాల్సిన ఏర్పాట్లను జాగ్రత్తగా చూసుకోవాలని సూచించారు. వేలం కేంద్రంలో ఉన్న సౌకర్యాలను పరిశీలించారు. రైతులకు ఇబ్బందులు లేకుండా వసతులు ఏర్పాటు చేయాలని సూచించారు. అనంతరం రైతులతో సమావేశమై వేలానికి మంచి కండీషన్ ఉన్న బేళ్లను తీసుకురావాలని సూచించారు. ఈ ఏడాది రైతులకు మంచి ధరలు లభించాలని ఆశిస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో పొగాకు బోర్డు వైస్ చైర్మన్ బొడ్డపాటి బ్రహ్మయ్య, పొగాకు బోర్డు ప్రాంతీయ అధికారి ఎం. లక్ష్మణరావు, ప్రొడక్షన్ మేనేజర్, వేలం నిర్వహణ అధికారి కేవీ రామాంజనేయులు, టంగుటూరు వేలం నిర్వహణ అధికారి అట్లూరి శ్రీనివాసరావు, పొగాకు రైతులు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా పలువురు రైతులు, పొగాకు బోర్డు సిబ్బంది ఈడీ అద్దంకి శ్రీధర్ బాబు సేవలను కొనియాడారు. గత రెండేళ్ల కాలంలో ఎటువంటి అపరాధ రుసుం లేకుండా అధికంగా పండించిన పొగాకును విక్రయించుకోవడం ద్వారా రైతులకు ఎంతో లాభం చేకూరిందన్నారు. అలాగే పొగాకు చూరను వేలం ప్రక్రియ ద్వారా కొనుగోలు చేయించారన్నారు. రైతులకు గతంలో 15 రోజులకు నగదు బ్యాంకు ఖాతాల్లో జమయ్యేదని, దాన్ని 9 రోజులకు తగ్గించారన్నారు. రైతుల బ్యారన్ ఇన్సూరెన్సు రూ.2 లక్షల నుంచి రూ.6 లక్షలకు పెంచడం వంటి ఎన్నో కార్యక్రమాలు నిర్వహించారన్నారు.

పృథులగిరికి బ్రహ్మోత్సవ శోభ..!

- రేపటి నుంచి పృథులగిరి బ్రహ్మోత్సవాలు
- 13న పృథులగిరి లక్ష్మీనృసింహస్వామి తిరునాళ్ల
- ఆలయంలో పూర్తయిన ఏర్పాట్లు



ఆలయం సమీపంలో కోనేరు



స్వామి గర్భగుడి

మర్రిపూడి: రాష్ట్రంలో ప్రసిద్ధి గాంచిన దేవాలయాల్లో ఒకటిగా నిలిచిన పృథులగిరి లక్ష్మీనృసింహస్వామి బ్రహ్మోత్సవాలు శనివారం నుంచి ప్రారంభం కానున్నాయి. తిరునాళ్లకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి నాగార్జునరెడ్డి తెలిపారు. మర్రిపూడి పరిధిలోని పృథులగిరిపై వెలసిన లక్ష్మీనృసింహస్వామి బ్రహ్మోత్సవాలు ఏటా ఫాల్గుణశుద్ధ దశమి నుంచి ఎంతో వైభవంగా జరుగుతాయి. బ్రహ్మోత్సవాలు ఈ ఏడాది ఎంతో ప్రత్యేకతను సంతరించుకున్నాయి. బ్రహ్మోత్సవాల్లో రాష్ట్ర నలుమూలల నుంచి భక్తులు పాల్గొంటారు.

ఆలయ చరిత్ర....

క్రీస్తుశకం 6,7 శతాబ్దంలోని తొలిచాళుక్యుల కాలంలో దేవుని గర్భగుడి, ఆలయం, మండప నిర్మాణం, గణపతి, అమ్మవారు, నందీశ్వరుని విగ్రహాలు ప్రతిష్టించారు. నరసింహ భక్తుడైన సాళువ తెలుంగురాయులు 1450–60 కాలంలో పృధులసీమను పాలించిన సమయంలో పృధులగిరి కొండపై గుడి, కోనేరు, తవ్వించడంతో ఈ ఆలయం అహోబిళం క్షేత్ర ప్రభావాన్ని సంతరించుకుందని చరిత్ర తెలియజేస్తుంది. 1914–15లో తాడివారిపల్లె అయ్యవార్లు శ్రీ రామకవచం లక్ష్మీనారాయణ అయ్యవారి ఆధ్వర్యంలో లక్ష్మీన్నారాయణ యంత్రసహితంగా ప్రతిష్టించారు. 19 శతాబ్దంలో వేంకటగిరి రాజా వారు దేవస్థానానికి ప్రధాన ధర్మకర్తగా గుర్తింపు పొందిన తర్వాత గాలిగోపురం, దేవాలయ పునరుద్ధరణ చేసి 136 ఎకరాల మెట్టభూమిని దానం చేశారు. అయితే శతాబ్దాల క్రితం వరకు ఇక్కడ నరసింహ క్షేత్రం ఒక్కటే ఉండేదని, బ్రహ్మోత్సవాలు జరిగే సమయంలో ప్రజలు అక్కడి చేరుకుని ఉత్సవాలు జరిపిస్తూ దక్షణ ప్రాంతానికి ఉన్న కొండ ఎల్తైన ప్రదేశంలో బసచేశారు. దీనికి సమీపంలో లింగాకృతి ఒక శిల ఉంది.


శిల సమీపంలో సత్రం నిర్మించాలనే ఉద్దేశంతో పునాదులు తవ్వుతుంటే పూర్వపు ఇటుకలతో కట్టిన ఆలయ లింగాకృతి కనిపించింది. తర్వాత ఆలయ పునాదులు, దేవాలయం, గణపతి, నందీశ్వరునితో పాటు మరికొన్ని విగ్రహాలు తవ్వకాల్లో లభించాయి. వారు నిర్మించిన ఆలయం పూర్తిగా శిథిలావస్థకు చేరడంతో 1952లో పెదారికట్లకు చెందిన లక్ష్మయ్య, నరసింహారావుశ్రేష్టి అనే వ్యక్తులు ఆలయాన్ని పురర్ఃనిర్మించారు. దశాబ్దాల క్రితం వర్షాలు లేక క్షామం ఏర్పడితే ఈశ్వరునికి కోనేటి నీటితో అభిషేకం చేయించగా వర్షాలు కురిశాయని పెద్దలు చెబుతారు.

తిరునాళ్లకు రావాలంటే


ఒంగోలు నుంచి కర్నూల్ వెళ్లే ప్రధాన రహదారిలో పొదిలి ఉంటుంది. అక్కడి నుంచి 12 కిలోమీటర్లు దూరంలో మర్రిపూడి చేరుకుంటే 5 కిలోమీటర్లు దూరం ఉన్న పృధులగిరి లక్ష్మీనృసింహస్వామిని దర్శించుకోవచ్చు. మర్రిపూడి, పొదిలి నుంచి ఘాట్‌రోడ్ సౌకర్యం ఉంది. నిత్యం ఆర్టీసీ బస్సులు సౌకర్యం ఉంది.



లక్ష్మీనృసింహస్వామి మూలవిరాట్



కొండ కింద ఉన్న అభయాంజనేయస్వామి



మెట్లమార్గం

భక్తుల దొన ప్రత్యేకత..

పృధులగిరి ఆలయానికి దాదాపు ఒకటిన్నర కిలోమీటరు దూరంలో ఎత్తయిన ప్రదేశంలో భక్తులదొన ఉంది. ఈ దొన నుంచి పూర్వీకులు నీళ్ల తెచ్చి స్వామికి అభిషేకం చేసినట్లు తెలుస్తుంది. కాలానుగుణంగా మారి బచ్చలదొనగా పిలవబడే ఈ దొన భక్తులను ఎంతో విశేషంగా ఆకర్షించింది. ఎత్తయిన ప్రదేశంలో ఓ పెద్దరాయికి మధ్యలో వృత్తాకారంలో రంధ్రం ఉంటుంది. ఆ రంధ్రంలో అన్ని సమయాల్లో నీరు ఉంటాయని, ఆ నీళ్ల చల్లగా, తీయ్యగా ఉండటం విశేషం అని భక్తులు చెబుతారు.

ఆ పేరు అలా వచ్చింది..

పూర్వకాలం ఎందరో రుషులు, మునులు ఈ కొండపై నివాసం ఉండేవారని, ఈ కొండ వికసించిన కమలం వలే వృత్తాకారంలో ఉండటంతో ఈ క్షేత్రానికి పృధులకొండ అని పేరు వచ్చింది. ఈ ప్రదేశంలో పెద్ద పెద్ద గుహలు, దోనెలు, పచ్చనిచెట్లు ఆహ్లాదకరంగా ఉండటంతో భక్తులను విశేషంగా ఆకర్షించాయి. పృధులేశ్వరుడు చుట్టుపక్కల గ్రామాల ప్రజలకు ఇలవేల్పుగా కొలుస్తారు. శివుడు, విష్ణు దేవాలయాలు ఒకే చోట ఉండటంతో బ్రహ్మోత్సవాలు ప్రత్యేకతను సంతరించుకున్నాయి. అహోబిళం క్షేత్ర తర్వాత శివ, విష్ణువులు ఒకే చోట ఉండటం చాలా అరుదు అని భక్తులు బావిస్తారు. పృధులాద్రిని పంచనాద్రి అని కూడా పిలుస్తారు. కొండ ప్రాంతంలో చాలా ప్రశాంతంగా ఆహ్లాదకరంగా ఉండటంతో మునులు, సిద్ధులు ఇక్కడ నివశిస్తూ శివలింగాన్ని ప్రతిష్టించి దానికి నిర్మమహేశ్వరుడు అని నామకరణ చేసి నాలుగు దిక్కుల లింగాకృతులు ప్రతిష్టించడంతో పంచనాద్రి అనే పేరు వచ్చినట్లు చరిత్ర ఆధారాలను బట్టి తెలుస్తుంది.

సేంద్రియ సాగులో అధిక దిగుబడులు



ప్రకృతి వ్యవసాయ పద్ధతుల గురించి వివరిస్తున్న యూనిట్ వెంకట్రావు

టంగుటూరు: ప్రకృతి సేద్యంలో అధిక దిగుబడులు వస్తాయని ప్రకృతి వ్యవసాయ అధికారి వెంకట్రావు అన్నారు. మండలంలోని మర్లపాడులో గురువారం ఏపీ సీఎన్ఎఫ్ సిబ్బంది, యూనిట్ ఇన్‌చార్జి వెంకట్రావు సొంత పొలంలో 30 రకాల విత్తనాలతో పీఎండీఎస్ ప్రీ మాన్ డ్రై సోయింగ్ విత్తనాలను తయారు చేసి పొలంలో వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులంతా వరి, శనగ, మినుము పంటల కోతల పచ్చి రొట్టి గింజలు, సుగంధ ద్రవ్యాలు, నూనె గింజలు, చిరుధాన్యాలు, ఆకుకూరలు ఇలా అన్ని రకాల జాతులతో కలిపిన ఈ కిట్టును భూమిలో చల్లడం ద్వారా 45 రోజుల తర్వాత పశువులు మేతగా వాడుకోవచ్చన్నారు. భూమిలో కలియ దున్నడం వల్ల నేలకు కావాల్సిన పోషకాలు అందుతాయన్నారు.

పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత



అవగాహన కల్పిస్తున్న ఎంపీడీఓ రామాంజనేయులు

కొండపి: పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యతని ఎంపీడీఓ రామాంజనేయులు అన్నారు. మండలంలోని కె.ఉప్పలపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో స్వచ్ఛాంధ్ర..స్వర్ణ దివాస్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన తడిచెత్త, పొడిచెత్త గురించి వివరించారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంటే అందరూ ఆరోగ్యంగా ఉంటారన్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వి.సూసన్నకుమార్, ఏఓ రామకృష్ణ, ఉపాధ్యాయులు, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

టంగుటూరు: ప్రతి ఒక్కరూ ఇంటి పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలని పంచాయతీ కార్యదర్శి దారా వెంకట్రావు అన్నారు. మండలంలోని జమ్ములపాలెంలో ఇంటింటి చెత్త సేకరణలో భాగంగా గురువారం చెత్త బుట్టలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కార్యదర్శి మాట్లాడుతూ ప్రజలు తమ ఇళ్లు, ఇంటి పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవడం ద్వారా వ్యాధులు దరిచేరవన్నారు. అనంతరం తడి చెత్త, పొడి చెత్త వేసే చేయు విధానంపై అవగాహన కల్పించారు.

సమాజాభివృద్ధిలో మహిళల పాత్ర అనిర్వచనీయం



చెన్నిపాడులో ర్యాలీ చేపట్టిన విద్యార్థినులు, అంగన్‌వాడీలు

పొన్నలూరు: సమాజాభివృద్ధిలో మహిళల పాత్ర అనిర్వచనీయమని అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు వై సత్యవతి అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవ వారోత్సవాల్లో భాగంగా మండలంలోని చెన్నిపాడులో విద్యార్థినులతో ర్యాలీ నిర్వహించి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళల అభివృద్ధికి అడ్డుపడే అవరోధాలను దాటుకొని అన్ని రంగాల్లో రాణించాలన్నారు. బాలికలు, మహిళలపై నిత్యం జరుగుతున్న లైంగిక దాడులు, బాల్య వివాహాలు వంటి బూజు పట్టిన పితృస్వామ్య భావజాల బంధాలను చేదించుకుంటూ ఉన్నత లక్ష్యాల వైపు అడుగులు వేయాలన్నారు. మహిళలు కుటుంబానికి, సమాజానికి వెన్నెముక లాంటి వారన్నారు. కొండపి ప్రాజెక్టు అధ్యక్షురాలు పోలమ్మ, హెచ్‌ఎం వేణుగోపాల్, పీఈటీ రత్తమ్మ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

హనుమంతునిపాడు: స్థానిక అంగన్‌వాడీ కేంద్రం -1లో గురువారం జాతీయ మహిళా దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా కేంద్రానికి రోజూ చిన్నారులను పంపించిన తల్లులను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా సూపర్‌వైజర్లు షేక్ గౌస్‌నీషాబేగం, కృపావరం మాట్లాడుతూ అంగన్‌వాడీ చిన్నారులకు ఆటపాడలతో నాణ్యమైన విద్య అందుతుందన్నారు.

రైతులకు భారంగా ప్రభుత్వ సంస్కరణలు



ధర్నాలో మాట్లాడుతున్న సీపీఎం మండల మాజీ కార్యదర్శి వెంకటేశ్వర్లు

సీఎస్‌పురం(పామూరు): రైతులకు మేలు చేకూర్చుతామంటూ ప్రభుత్వాలు ప్రవేశపెడుతున్న సంస్కరణలు రైతులకు భారంగా మారుతున్నాయి తప్ప ఎటువంటి ప్రయోజనం చేకూరడం లేదని సీపీఎం మండల మాజీ కార్యదర్శి ఊసా వెంకటేశ్వర్లు అన్నారు. ప్రజాసమస్యల పరిష్కారం కోరుతూ, తహసీల్దార్ కార్యాలయంలో అవినీతిని నిరోధించాలని కోరుతూ రైతుసంఘం ఆధ్వర్యంలో గురువారం తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం గద్దెనెక్కి 9 మాసాలు దాటుతున్నా నేటికి ఒక్క కొత్త రేషన్‌కార్డు ఇవ్వలేదని, ఒక్కరికీ నివేశనా స్థలం ఇవ్వలేదన్నారు. రోడ్డు నిర్మాణంలో భూములు కోల్పోయిన రైతులకు వెంటనే పరిహారం చెల్లించి రైతులను ఆదుకోవాలని కోరారు. ఈసందర్భంగా పలువురు రైతులు మాట్లాడుతూ రెవెన్యూ అధికారులు సమస్యలు పరిష్కరించకుండా ఇబ్బందులు పెడుతున్నారన్నారు. తిరుపతి రెడ్డి, పి.నరసింహులు, జి.నారాయణ, అబ్బిరెడ్డి, అజిత్‌బాషా, బి.రత్నం, వెంకటసుబ్బయ్య, నారాయణ, కొండయ్యలు పాల్గొన్నారు.

రక్త నమూనా సకాలంలో అందజేయాలి



రికార్డులు పరిశీలిస్తున్న మలేరియా అధికారి నాగార్జునరావు

లింగసముద్రం: రక్త నమూనాను సకాలంలో పరీక్షించి రోగులకు క్వాలిటీ ఫలితాలు త్వరితగతిన అందజేయాలని జిల్లా సహాయ మలేరియా అధికారి వి.నాగార్జున చెప్పారు. బుధవారం స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆయన తనిఖీ చేసి ల్యాబ్, రికార్డులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరోగ్య కేంద్రాలకు వచ్చే రోగులకు సకాలంలో పరీక్షలు నిర్వహించి వారికి మందులు అందజేయాలన్నారు. రక్త పూతల పరీక్షల నిర్దేశిత లక్ష్యాల గురించి వైద్యాధికారి డాక్టర్ రమేష్‌ను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ముత్యాలపాడు సచివాలయంలో జరుగుతున్న ఫ్యామిలీ ఫిజీషియన్ కాన్సెప్ట్ కార్యక్రమాన్ని పరిశీలించి ఆరోగ్య కార్యకర్తలకు తగు సూచనలు చేశారు. సీహెచ్‌ఓ జి.శ్రీనివాసులు, ఏఎన్‌ఎంలు, ఆశాలు పాల్గొన్నారు.

బంగారు సాయిబాబా విగ్రహం అందజేత



బంగారు సాయిబాబా విగ్రహాన్ని విరాళంగా అందజేస్తున్న భక్తుడు

కనిగిరిరూరల్(హనుమంతునిపాడు): పట్టణంలో సాయిబాబా ఆలయానికి గురువారం బంగారు సాయిబాబా విగ్రహాన్ని అందజేశారు. ఈ సందర్భంగా దాత ముచర్ల ధర్మారావు పద్మజ దంపతులు మాట్లాడుతూ తమ కుమారికి అమెరికాలో ఉద్యోగం వస్తే స్వామికి సమర్పిస్తామని మొక్కుకున్నామన్నారు. ఉద్యోగం రావడంతో తొలి వేతనం రూ.4 లక్షలు ఖర్చు చేసి పసిడి సాయిబాబా విగ్రహాన్ని తయారు చేయించి ఆలయానికి అందించి మొక్కులు తీర్చుకున్నారు.

విగ్రహ ప్రతిష్టా మహోత్సవాలు ప్రారంభం

సీఎస్‌పురం(పామూరు): మండలంలోని శీలంవారిపల్లెలో నూతనంగా నిర్మించిన ఆలయంలో శ్రీదేవి, భూదేవి సమేత వెంకటేశ్వరస్వామి విగ్రహ ప్రతిష్టా కార్యక్రమం గురువారం రాత్రి రుత్వికుల వేదమంత్రాల నడుమ ఘనంగా ప్రారంభమైంది. పూజల్లో విజయ బాబూరావు దంపతులచేత అర్చకులు భగవత్‌ప్రార్థన, విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, రక్షాబంధనం, అంకురార్పణ చేశారు. ఈ నెల 9న ప్రతిష్టా కార్యక్రమం, శాంతి కల్యాణం జరగనుంది.



పూజలు నిర్వహిస్తున్న అర్చకులు, పాల్గొన్న భక్తులు

సమగ్ర యాజమాన్య పద్ధతుల్లో అధిక ఆదాయం



రేగులచెలకలో మాట్లాడుతున్న ఏడీఏ వెంకటరమణ

సీఎస్‌పురం(పామూరు): వరిలో సమగ్ర యాజమాన్య పద్ధతులను పాటిస్తే అధిక ఆదాయం పొందవచ్చని ఏడీఏ ఏ వెంకట రమణ అన్నారు. మండలంలోని రేగులచెలకలో ఏఓ బి.సంపత్‌కుమార్ ఆధ్వర్యంలో పొలంబడి నిర్వహించారు. ఈ సందర్భంగా సమగ్ర సస్యరక్షణ చర్యల గురించి వివరించారు. ఏఈఓ పావలి శ్రీనివాసులు వీఏఏ వెండిదండి చిరంజీవిరెడ్డి పాల్గొన్నారు.

కులవృత్తుల ప్రోత్సాహకానికే ఆదరణ



మాట్లాడుతున్న ఎంపీడీఓ బ్రహ్మయ్య

పామూరు: కులవృత్తులను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం ఆదరణ-3 అమలు చేయనున్నట్లు ఎంపీడీఓ ఎల్ బ్రహ్మయ్య అన్నారు. స్థానిక మండల పరిషత్ సమావేశహాలులో గురువారం ఆదరణ-3 పథకంపై పంచాయతీ కార్యదర్శులు, వెల్ఫేర్ అసిస్టెంట్లు, కులవృత్తిసంఘాల ప్రతినిధులకు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆదరణ పథకంకింద ఆయా వృత్తులవారికి పరికరాలు అందజేసే అవకాశం ఉందన్నారు. అదేవిధంగా ఈడబ్ల్యూఎస్ మహిళలకు టైలరింగ్‌లో శిక్షణనిచ్చి ఉచితంగా కుట్టుమిషన్లు అందజేస్తామని, శిక్షణ దరఖాస్తు చేసుకోవాలని ఏపీఎం విద్యాసాగర్ తెలిపారు. ఎంపీడీఓ కార్యాలయ ఏఓ ఎస్.చెన్నకేశవరెడ్డి, ఈఓపీఆర్‌డీ గవిరెడ్డి అరవిందరెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

మహిళా దినోత్సవానికి తరలిరండి

సింగరాయకొండ: వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో ఈనెల 8వ తేదీ శనివారం జరిగే అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలను భారీగా తరలిరావాలని పార్టీ నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు యనమల మాధవి పిలుపునిచ్చారు. కార్యక్రమానికి నియోజకవర్గంలోని ఆరు మండలాల నుంచి మహిళలు భారీగా తరలివచ్చి కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఆమె విజ్ఞప్తి చేశారు.

ఆదరణ లబ్ధిదారులకు నాణ్యమైన పరికరాలు

కొండపి: ఆదరణ-3 పథకం ద్వారా లబ్ధిదారులకు నాణ్యమైన పరికరాలు అందజేస్తామని ఎంపీడీఓ రామాంజనేయులు అన్నారు. స్థానిక మండల పరిషత్ అభివృద్ధి కార్యాలయంలో కులవృత్తి సంఘాలు, అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఎంపీడీఓ రామాంజనేయులు మాట్లాడుతూ ఆదరణ-3 పథకం ద్వారా కులవృత్తిదారులకు అవసరమైన పరికరాలు ఇవ్వడానికి ప్రభుత్వానికి నివేదిక ఇస్తామన్నారు. ఏఓ రామకృష్ణ, కులవృత్తి సంఘాల ప్రతినిధులు,కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపీడీఓ రామాంజనేయులు

16న మండల సమావేశం

పామూరు: మండల సర్వసభ్య సమావేశం స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశహాలులో ఈ నెల 16వ తేదీ ఉదయం 10.30 గంటలకు ఎంపీపీ గంగసాని లక్ష్మి అధ్యక్షతన జరుగుతుందని ఎంపీడీఓ ఎల్ బ్రహ్మయ్య తెలిపారు. సమావేశానికి జెడ్పీటీసీ, ఎంపీటీసీలు, సర్పంచ్ హాజరుకావాలన్నారు.